క్లుప్తంగా

ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: హౌసింగ్ నిర్మాణాలు టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 244 ఇళ్లకుగాను 20 పూర్తయ్యాయని, మరో 224 పలు దశలలో ఉన్నాయని, అయితే వచ్చే వారం నాటికి మరో 20 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా టార్గెట్ పెట్టుకొని విధులు నిర్వహించాలని హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బంగారయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సేవా ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేత



మాచర్ల : పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సేవా ఆశ్రమానికి మీనాక్షి కంటి ఆసుపత్రి డైరెక్టర్, రోటరీ క్లబ్ సభ్యుడు మారేపల్లి లక్ష్మీనారాయణ రూ.20 వేలు ఖరీదు చేసే సీలింగ్ ఫ్యానులు ఆశ్రమ నిర్వాహకులకు సోమవారం అందజేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశ్రమ అభివృద్ధికి మెట్టు గోవింద రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అందులో భాగస్వాములు కావడానికి అనాథ పిల్లలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తాను సీలింగ్ ఫ్యాన్లు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు, పల్నాడు ప్రతిభ కాలేజీల డైరెక్టర్ పఠాన్ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



వెల్దుర్తి: మాచర్ల నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకున్న పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం వెల్దుర్తిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్ర ప్రజలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు సహాయ సహకారాలందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 27 మందికి రూ.34 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జేబీఆర్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌకధర దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

దుర్గి: మండల పరిధిలోని ఓబులేశునిపల్లె, అడిగొప్పల, కోలగుట్ల, కాకిరాల, దుర్గి, కంచరగుంట గ్రామాలలో ఖాళీగా ఉన్న చౌకధర దుకాణాల కోసం డిసెంబర్ 4 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఐ.ఫణీంద్ర కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అడిగొప్పల-1కి ఓసీ ఉమెన్, 2కి బీసీ-డీ ఉమెన్, ఓబులేశునిపల్లె ఎస్సీ (దివ్యాంగులు), కోలగుట్ల ఓసీ జనరల్, కాకిరాల బీసీ-బీ, కంచరగుంట ఓసీ ఈడబ్ల్యూఎస్, దుర్గి ఓసీకు కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్మీడియట్ చదివి ఉండాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో రెవెన్యూ డివిజనల్ అధికారి, గురజాల వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

యువకుడి దుర్మరణం

నాదెండ్ల: నిర్మాణంలో ఉన్న వంతెనపై నుండి ద్విచక్రవాహనంతో క్రిందపడి యువకుడు మృత్యువాత పాలయ్యాడు. గణపవరం గ్రామానికి చెందిన జంపని ప్రసాద్ (38) బాపట్ల జిల్లా చీరాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తుంటాడు. గతంలో ఆయన సివిల్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ ఇటీవల కళాశాలలో ఉద్యోగంలో చేరాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో చీరాల నుంచి గణపవరంకు బైక్‌పై బయలు దేరాడు. పర్చూరు సమీపానికి వచ్చే సరికి నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ మీదకు వెళ్ళాడు. సగం వరకు నిర్మించిన వంతెన పై నుండి ద్విచక్రవాహనంతో సహా క్రింద పడ్డాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు.

బడి వంటకు ధరల మంట

- భారంగా మధ్యాహ్న భోజన పథకం
- మండుతున్న నిత్యావసరాల ధరలు
- ఇప్పటికీ పాత మెనూ ధరలే
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పిడుగురాళ్ల: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల శరాఘాతంగా మారింది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు తగినట్లు ప్రభుత్వం బడ్జెట్ పెంచడం లేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలతో పాటు పాఠశాలలకు కూడా ధరల మంట తగులుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. మన బడి, నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారు. విద్యార్థులకు పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించేవారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు ఆసక్తి చూపేవారు. కానీ నేడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశన్నంటుతున్నాయి. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంట భారంగా మారింది. అప్పు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నా, బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. దీంతో శుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అదే మెనూ.. అవే ధరలు

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022లో పాత ధరలు సరిపోకపోవటంతో మధ్యాహ్న భోజనం ధరలను పెంచారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు రూ.4.16 ఉంటే దానిని రూ.5.88 చేశారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు గతంలో రూ.5.16 ఉంటే దానిని రూ.8.16కు పెంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిన మెనూ మేరకు సోమవారం అన్నం, పప్పుచారు, ఎగ్ కర్రీ, చిక్కీ, మంగళవారం పులిహోర, టమాటా పప్పు, గుడ్డు, బుధవారం వెజిటబుల్ రైస్ ఆలు కూర్మా, గుడ్డు, చిక్కీ, గురువారం కిచిడీ, పెసరపప్పు, అన్నం, టమాటా చెట్నీ, గుడ్డు, శుక్ర వారం అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం అన్నం సాంబార్, స్వీట్, పొంగలి పెట్టాలి. అయితే ఇటీవలే నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు భారీ స్థాయిలో పెరగటంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం మాకు మరింత ధరలు పెంచితే గిట్టుబాటు అవుతుందని, లేకపోతే నష్టాల్లోనే విద్యార్థులకు భోజనం వండి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఈ పరిస్థితిని గుర్తించాలని పలువురు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనంలో తగ్గుతున్న నాణ్యత

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో నిర్వాహకులు ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. ఫలితంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత రాను రాను తగ్గుతుంది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత మెనూ ప్రకారమే బిల్లులు



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 2022లో పెరిగిన మెనూ ధరల ప్రకారమే బిల్లులు అందుతున్నాయి. నిర్వాహకులకు బిల్లులు పెండింగ్ లేకుండా అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం. మధ్యాహ్న భోజనం పంపిణీలో నాణ్యత లోపిస్తే సహించేది లేదు.

– ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి

ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేబీఆర్

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జేబీఆర్ పాల్గొని ప్రసంగించారు. గడిచిన ఆరు నెలల కాలంలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, వాటికనుగుణంగా సంబంధిత అధికారులు పనిచేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. పెన్షన్‌ను పెంచి రూ.4 వేలు అందిస్తున్నామని, మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలెండర్‌ను అందజేసినట్లు వివరించారు. గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో మమేకమై మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామ సచివాలయాలలోని ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజల సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని అన్నారు. ఎంపీపీ యేచూరి సునీత అధ్యక్షత వహించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రత్యేక నిధులు కేటాయించి మండలాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు గడిచిన మూడు నెలలుగా చేపట్టిన చర్యల గురించి భవిష్యత్ ప్రణాళికను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, ఈఓపీఆర్‌డీ సత్యప్రసాద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

మాచర్ల విద్యుత్ ఈఈగా సింగయ్య బాధ్యతలు



మాచర్ల: మాచర్ల విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా ఎం.సింగయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. మాచర్ల డివిజన్ ఈఈగా ఉన్న హరిబాబు మంగళగిరి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు నరసరావుపేటకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్ల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఎం.సింగయ్యను ఈఈగా మాచర్లకు బదిలీ చేశారు. సింగయ్య మాచర్ల విద్యుత్ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఏఈలు, ఏడీఈలు, విద్యుత్ శాఖ అధికారులు, లైన్‌మెన్‌లు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. సింగయ్య మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మండలాల్లో మెరుగైన విద్యుత్ అందించి, వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూద్దామన్నారు. ఉత్తమ విద్యుత్ సరఫరా చేసేందుకు ముందుకు వెళ్లాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

రెంటచింతల: గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని రెంటాల గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.72,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మీ ప్రాంతంలో అసాంఘిక చర్యలు జరగకుండా ఉండాలంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడం కోసం ఎవరైనా గ్రామం విడిచి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి

దుర్గి: మండల పరిధిలోని అడిగొప్పల గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఎల్.సుధీర్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.75,200 నగదును స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఐ వివరించారు. మండలంలో పేకాట, కోడిపందేలు నాటు సారా, తెలంగాణ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పట్ల చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం అందించడంలో ఇక్కట్లు



వినతి పత్రం అందజేస్తున్న ఎంఈఓ అల్లి సురేష్, హెచ్ఎంలు విజయకుమారి, మంజరి, ప్రశాంతి

మాచర్ల రూరల్: నాటి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, రేషన్ డీలర్ల అవినీతితో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించటంలో పాఠశాలల హెచ్ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలల్లోకి వెళితే మండలంలోని కంభంపాడు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీ, ఎంపీపీఎస్సీ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం నిమిత్తం రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిన అధికారులు సక్రమంగా పంపిణీ చేయక పోవటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు భోజనం అందించటంలో ఇబ్బందులకు గురవుతున్నారు. 2020 సంవత్సరంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పాఠశాలలకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా రెవెన్యూ అధికారులు రికార్డుల్లో రేషన్ డీలర్లకు అందించినట్లు, అవి వారు పాఠశాలలకు పంపిణీ చేసినట్లు నమోదు చేసుకున్నారు. దీనిపై అప్పటి నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలు మండల విద్యాశాఖాధికారుల ద్వారా తహసీల్దార్‌కు, సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు ఆ పొరపాటును సరిచేస్తామంటూ దగ్గరలో ఉన్న రేషన్ డీలర్ల దగ్గర నుంచి బియ్యం సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. మారిన ప్రభుత్వ పాలన నేపథ్యంలో కొత్తగా వచ్చిన డీలర్లు మేం పంపిణీ చేయమంటూ చేతులెత్తేయటంతో అక్టోబర్, నవంబర్ నెలలకు పాఠశాలలకు బియ్యం పంపిణీ చేయలేదు. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం వండేందుకు బియ్యం లేక హెచ్ఎంలు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బియ్యం అందించటంలో ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి పాఠశాలలకు బియ్యం అందకపోవటంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించే పరిస్థితి వస్తుందనే ఆందోళనతో హెచ్ఎంలు రామిరెడ్డి విజయకుమారి, ఎం.రత్నమంజరి, ఎస్.మేరి ప్రశాంతి, ఎంఈఓ అల్లి సురేష్‌ని కలిసి తమ ఇబ్బందులను తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఈఓ సురేష్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బత్తుల వాణిని కలిసి విద్యార్థులకు భోజనం అందించటంలో ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. అలాగే ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

దాచేపల్లి : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి చెందినట్లు ఎస్ఐ పాపారావు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మేడా రామిరెడ్డి(47) ఈ నెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయంలో భారీగా నష్టాలు రావటంతో చేసిన అప్పులు తీర్చలేక రామిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో సంక్షోభాన్ని అరికట్టాలి


పిడుగురాళ్ల: డిసెంబర్ 1వ తేదీన కామ్రేడ్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతి సందర్భంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో పెరుగుతున్న సంక్షోభం మన కర్తవ్యాలు అంశంపై జరిగే సభను విజయవంతం చేయాలని పట్టణంలోని లెనిన్‌నగర్ స్తూపం వద్ద సోమవారం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ కామ్రేడ్ కోటయ్య, చెన్నయ్యలు దేశంలో భూస్వామ్య వ్యవస్థలు నాశనం కావాలని, పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం కావాలనే లక్ష్యంతో నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పి పేద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా ఉండాలని కోరుకుంటూ తమ జీవితాంతం పని చేసిన కామ్రేడ్ ఆశయాలను పూర్తి చేయాలని అన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కార్పొరేట్ పెట్టుబడి దారులకు కట్టబెడుతున్న పాలకుల విధానాలపై పీడిత ప్రజలు ఐక్యంగా పోరాడాలని, ప్రజలపై పడుతున్న భారాల నుంచి పక్క దారి పట్టిస్తూ పబ్బం గడుపుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో జరగనున్న సభకు రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ చెన్నయ్య, ఇస్రాయేలు, కృష్ణ, వెంకాయమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి ఎంతో ముఖ్యం



రెంటచింతల: విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి ఎంతో ముఖ్యమని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందురెడ్డి అన్నారు. స్వామి వివేకానంద రామకృష్ణ మిషన్ స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక రామకృష్ణ గురుకుల పాఠశాలలో భారత జాతికి నా హితవు అనే పుస్తకం ఆధారంగా విద్యార్థులకు జాగృతి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే నైతిక ఆధ్యాత్మిక విలువలు పెంపొందించే విధంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామి వివేకానంద కలలు కన్న నవభారత నిర్మాణం జరగాలంటే విద్యార్థులు, యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడలలో నడవాలని పిలుపునిచ్చారు. పల్నాడు ప్రాంతంలోని ప్రతి పాఠశాలలో, కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, విరువంతి శ్రీనివాస్, శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు



మోర్జంపాడులోని అమ్మవారు



మోర్జంపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి

మాచవరం: కార్తిక మాస చివరి సోమవారం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. శివ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవార ప్రత్యేక పూజలు

మాచర్ల : పట్టణంలో కార్తిక మాస చివరి సోమవారం పురస్కరించుకుని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నానాలు ఆచరించి ఉదయాన్నే రామప్ప గంగా పార్వతి నగరీశ్వరస్వామి, అయ్యప్పస్వామి, ఉగ్గమల్లేశ్వరస్వామి దేవాలయం, బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి, వాసవి కన్యకా పరమేశ్వరి, శంకరేశ్వరస్వామి, సాగర్ రోడ్డులో క్వారీ సమీపంలోని శివాలయం తదితర దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులు దైవ దర్శనం చేసుకుని దీపారాధనలు నిర్వహించారు. అర్చకులు ఆయా దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం 1 గంట నుంచి పట్టణంలోని దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.





దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్స్‌లో ఈ నెల 27న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు హాస్పటల్‌లో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇందులో జనరల్ మెడిసిన్, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు, మూత్ర సంబంధిత వ్యాధులతో పాటు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించబడునని తెలిపారు. సీటీ స్కాన్, టూ డీ ఎకో, ఈసీజీ, ఎండోస్కోపిలపై 50 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7386041722 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

జీవన ఎరువులతో భూమి సారవంతం



జీవన ఎరువు తయారీపై అవగాహన

మాదల(ముప్పాళ్ల): రైతులు జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జీవన ఎరువుల వాడకం, తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూ సారం దెబ్బతింటుందని, పశువుల ఎరువులో ట్రైకోడెర్మా విరిడి కలిపి జీవన ఎరువులు వాడటం వల్ల నేల నుంచి సంక్రమించే తెగుళ్లను నిరోధించవచ్చన్నారు. నేల భౌతిక లక్షణాలను మెరుగు పరిచి భూమిలో హార్మోన్లు, ఖనిజ లవణాలు అందుబాటులో ఉంచి మొక్క పెరుగుదలకు కృషి చేస్తాయన్నారు. రైతులకు ట్రైకో డెర్మావిరిడీ కలిపే విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జి.చైత్రిక, టి.లక్ష్మీశ్వేత, జి.భువనేశ్వరి, కె.దివ్య, కె.అఖిల, ఎస్కే ఆయిషా, ఆర్యహరి పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

అచ్చంపేట: నర్సరావుపేటలోని ఎస్ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ విజయ నిర్మల మెమోరియల్ సౌత్ ఇండియా మార్షల్ ఆర్ట్ ఛాంపియన్ షిష్ యోగాసనాల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్లు హెచ్ఎం సీహెచ్ కల్యాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను పీడీ సుజాత, హెచ్ఎం కల్యాణి, ఉపాధ్యాయులు అభినందించారు. 14 సంవత్సరాల బాలికల విభాగంలో కె.నాగ వినీత, ఒ.బ్లెస్సీ, ఆర్.దీప్తి, డి.నిస్సి, కె.స్వరూపారాణి, బాలుర విభాగంలో డి.అజయ్‌కుమార్, షేక్ సమ్మద్‌బాజి పథకాలు సాధించినట్లు పీడీ ఆలపాటి సుజాత తెలిపారు.



కేసానుపల్లి లూథరన్ చర్చిపై క్రిస్మస్ స్టార్



ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రసన్నకుమార్

మొదలైన క్రిస్మస్ సందడి

దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తు జన్మదినోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీస్తు పుట్టక దినమైన క్రిస్మస్ పండుగకు నెల రోజుల ముందు నుంచే క్రిస్మస్ సంబరాలు జరుపుకుంటారు. క్రిస్మస్ దినాలు ప్రారంభం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పుట్టుక గురించి పాస్టర్ జి.ఎస్.ప్రసన్నకుమార్ ప్రసంగించారు. క్రీస్తుని ఆరాధించటమే నిజమైన క్రిస్మస్ అని ఆయన చెప్పారు. క్రిస్మస్ పండుగ వేడుకల ప్రారంభం సందర్భంగా పలు చర్చిలపై క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.



దక్షిణగడ్డ చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్